# ముందుమాట



**కథానికా శిల్పంలో శ్రీపతి ప్రతిభ అగ్రగణ్యం. జీవితంలో ఉన్నత విలువలు సాహిత్యంలో ప్రతిబింబించాలనీ, వాస్తవికతే సాహిత్యానికి ఆయువుపట్టు కావాలని ఆయన విశ్వసిస్తారు.**

ప్రసిద్ధ రచయితలు ఎందరో ఉంటున్న మా ఊరుకు మరొక రచయిత వచ్చాడంటే సంతోషమే. ఇంతమంది గొప్ప రచయితలు ఉన్నందుకు విశాఖపట్నం ఒక ప్రధాన పర్యాటక కేంద్రమే కావలసింది. కానీ, ఇది తెలుగుదేశం. గుర్రప్పందేలకీ, చవకబారు సినిమాలకీ, పేకాటకీ, రాజకీయప్పుదవులకీ, షేర్ మార్కెట్‌లకీ ఎంతదూరమున్నా ఎగబడతారు కానీ, ఒక రచయితనో, ఒక చిత్రకారుడినో, ఒక గాయకుడినో, ఒక సంగీతవేత్తనో, ఒక క్రీడాకారుడినో పొరుగున ఉన్నా పోయి చూడరు. కథలు అంటే, అందులోనూ కథాశిల్పం పట్టు తెలిసిన రచయితలంటే పడిచచ్చే రకం మా స్నేహితుల్లో ఇంకా ఆ ఆకర్షణ. యువ రచయితలు కొందరు చూట్టానికి ఇంటికి వచ్చారంటే ఇంక చెప్పాలా? అట్లా నలుగురు స్నేహితులను వెంటబెట్టుకుని ఓ సాయంత్రం నా మీద దాడి చేయటానికే అన్నట్టు వచ్చాడో యువరచయిత.

మా పెద్దమ్మాయి తార పెళ్ళి సంబంధం పని మీద వస్తున్న స్నేహితుని కోసం ఆ సాయంత్రం విమానాశ్రయానికి వెళ్ళే హడావిడిలో ఉన్నాను. ఇదిగో గంటలో వచ్చేస్తాను నాన్నా అని మా పెద్దమ్మాయి కారు తీసుకునివెళ్ళింది. ఆమె వెళ్ళి దాదాపు రెండు గంటలు కావస్తోంది. ఇంకా తిరిగి రాలేదు. మా ఆవిడ ఆఫీసునించి వచ్చేవరకు ఆగే వ్యవధి లేదు. మా బుజ్జాయికి ఫోన్ చేశాను. డ్రైవర్‌ని వేరే పనిమీద పంపించాడంట. కారు నువ్వు వచ్చి తీసుకుంటావా, నన్ను రమ్మంటావా అని అడుగుతున్నాడు. నువ్వు వస్తే సంతోషం అన్నాను. అట్లా ఫోన్ పెట్టానో లేదో ఇదుగో వీళ్ళు వచ్చారు.

కొత్తగా వచ్చిన ఆ యువ రచయిత పేరు సత్యమూర్తట. ఆ పేరుతో కథకుడు ఎవరూ ఉన్నట్టు లేదే అన్నాను. అతడు నవ్వి ఊరుకున్నాడు. ఆ నవ్వులోనే అర్థమయింది అతడి గడుసుతనం. ఏదన్నా కలం పేరుతో రాస్తున్నాడో ఏమో. అట్లాంటిది ఏదన్నా ఉంటే దానంతటదే బయటపడుతుందిలే అని ఇతర వివరాలకోసం ఒత్తిడి చేయలేదు. క్షుద్ర సాహిత్యం పడగ ఎత్తిన ఒక ఉద్ధృత దశలో చాలమందికిమల్లె నేనూ పత్రికలు చూడటం మానేశాను. ఏమో, రాస్తున్నాడో ఏమో. పరిచయం చేసుకున్న మొదట్లోనే సత్యమూర్తి నా మీద సంధించిన మొదటి ప్రశ్న - కథలు ఎందుకు రాయడం మానేశారు అని. ఆ ప్రశ్నకు జవాబు చెప్పకుండా నేను దాటవేశాను. వేరే ముచ్చట్లలో పడ్డాం.

ఆయనతో వచ్చిన ఆ నలుగుర్లో ఒక్క నాగరాజు తప్ప మిగిలిన ముగ్గురు నాకు కొత్త. నాగరాజు మంచి రంగస్థల నటుడు. నాటక ప్రయోక్త. మా ఊళ్ళో రంగస్థల ప్రయోగాలకు అతడే చిర్నామా. ఆ నలుగురూ వయసులో సత్యమూర్తికన్నా పెద్ద వాళ్ళులాగానే కనిపించారు. వాళ్ళలో ముగ్గురు రచయితలేనట, భారీగా, దృఢంగా, ఎత్తుగా - వాళ్ళను చూస్తే క్రీడాకారుల్లా ఉన్నారేతప్ప రచయితల్లా ఒక్కరూ కనిపించలేదు. సత్యమూర్తి వాళ్ళల్లో చిన్నవాడిలాగా కనిపిస్తున్నాడు. బక్కపల్చగా, చిన్నగా, ఆడపిల్లలా ముద్దుగా ఉన్నాడు. వాళ్ళల్లో వాళ్ళు మాటాడుకుంటుంటే నాకు అర్థమయిందేమిటంటే, సత్యమూర్తి అంటే వాళ్ళకు ప్రేమ, గౌరవం. కండ్లద్దాలు, ఖాదీ బండార్‌లలో దొరికే గోధుమరంగు లాల్చీ, నీలం రంగు జీన్స్, ఆకుచెప్పుల్తో యూనివర్సిటీ హాస్టల్స్‌లో కనిపించే రిసెర్చి విద్యార్థిలా ఉన్నాడు. పెద్దవాడిలా కనిపించటానికే అన్నట్టు గెడ్డం, మీసాలు పెంచాడు. ఆ ముఖం చూస్తే సత్యమూర్తి వయసు పాతికేళ్ళు ఉండవచ్చుననిపించింది. పరధ్యానంగా ఉన్న అతడి చూపుల్లో ఆత్మాభిమానం, నిగ్రహం కనిపిస్తున్నాయి. మరో సమయంలో అయితే, వాళ్ళతో ఎంతసేపన్నా కూచునేవాడినే. ఎంత గొప్పగా ఉండేదో!

పూర్వాశ్రమంలో కథలు రాయడంవల్లా, ఈనాటి ప్రముఖ రచయితలు చాలమంది స్నేహితులు కావడం వల్లా, రచయిత మిత్రులు కలిసినప్పుడల్లా రాత్రింబగళ్ళు మరచి కథా రహస్యాలను చెప్పుకుంటూ బతకగల అభిరుచి ఉంటంవల్లా, రచన తొలిరోజుల్లో కొన్ని ఏండ్లపాటు రచననే ఆకలిదప్పులుగా జీవించటం వల్లా ఇప్పటికీ ఒక మంచి రచనగాని, ఒక మంచి రచయితగాని కంటపడితే అదే పండుగ.

దాంతో ఆరంభమవుతుంది ఆ రచన గురించి లేదా ఆ రచయిత గురించి చర్చ. కాఫీహోటళ్ళల్లో, సినిమా థియేటర్ల దగ్గర, పాత పుస్తకాలను అమ్మే కాలిబాటల మీద, నాటక ప్రదర్శనల దగ్గర, గ్రంథాలయ ఆవరణల్లో, సాహితీ సమావేశాల్లో, స్నేహితుల ఇండ్లల్లో, చివరికి కార్యాలయాల్లో కనిపించిన ప్రతి రచయితను పట్టుకుని, ఆ రచన గురించి చెప్పి, చదివించి, చర్చించి, పొగడి, పోట్లాడి, రచయితను కలుసుకుని, స్నేహాభిమానాలు కలబోసుకుని, రాత్రింబగళ్ళు తిరిగి, తిని, తాగి, పాడి, ఏడ్చి అదే జీవితంగా సాహిత్య సాధన సాగించిన గతం మూలంగా ఇంకా కథలంటే, రచయితలంటే మోజు. కథలు రాయటం మానేసినప్పటినించీ ఆ మోజు మరింత పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు ఆనాటి నా రచయిత మిత్రుల పేర్లు కనిపించటంలేదు. ఏమయిపోయారో ఆ రచయితలంతా? కర్మజీవుల్లా బతికే ఆనాటి సంపాదకులు, సాహిత్య కళాసౌందర్యపుమణులు పొదిగిన ఆ పత్రికలు ఎక్కడ? ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహాలూ అని ఏకతార మీద పాడుకోవడం తప్ప చేసేదేముంటుంది?

మీరేం చేస్తారు అని అడిగాను సత్యమూర్తిని. అంటే జీవనభృతికి కథలు రాయటం మాత్రమే తెలుగుదేశంలో సరిపోదు కాబట్టి మరి బతుకు తెరువుకోసం ఏం చేస్తున్నారన్నది నా ఉద్దేశం.

కథలు రాస్తాను అన్నాడు సత్యమూర్తి.

ఆ ఒక్క సమాధానంతో అతడంటే నాకు అభిమానం ఏర్పడిపోయింది. తెలుగు రచయితకు ఇదివరలో లేంది, ఇప్పుడు కావలసింది అదే - గుండె మీద చెయ్యి వేసుకుని నేను రచయితను అని చెప్పుకోగల సత్తా, చేవ. వేరొకరయితే తను చేస్తున్న ఉద్యోగం గురించి సిగ్గుమాలి చెప్పుకునేవాడు. గట్టి పిండమే అనిపించింది. సత్యమూర్తి వృత్తి కథలు రాయటమేనట. ఇంకోపని ఏదీ అతడికి చేతకాదట. ఆ సంగతి తెలీక ఢిల్లీలో ఒక కళాశాలలో ఏడాదిపాటు విద్యార్థులకు ఆంగ్ల సాహిత్యం బోధించాడట. బొంబేలో ఒక ఇంగ్లీషు దిన పత్రికలో రెండేళ్ళపాటు ఉప సంపాదకుడిగా వెలిగించాడట. జీవితంలో ఏ ఉద్యోగానికీ తను పనికిరాడని తెలుసుకుని కథలు రాయటం ఒక్కటే తనకు చేతనయినందుకు అదృష్టంగా భావించి, ఏలూరులో ఉంటున్న తలిదండ్రుల దగ్గరకు వచ్చేశాడట.

అంతలో మా పెద్దమ్మాయి తార వచ్చేసింది.

నా స్నేహితులు. అంతా రచయితలు. వాళ్ళతో మాట్లాడు. కాఫీ ఏర్పాట్ల గురించి థామస్‌కి చెప్పాను. చూడు - అని వాళ్ళను ఇంట్లో ఉండమని చెప్పి, కారు వద్దన్నానని బుజ్జాయికి చెప్పమని, ఆ యువ రచయితల దగ్గర వీడ్కోలు తీసుకుని వెళ్ళిపోయాను. నాకన్నా మా అమ్మాయి తెలివైంది. ముఖ్యంగా కొత్తవాళ్ళతో, ఈ తరం వాళ్ళతో కలుపుగోలుతనంతో, వాళ్ళు నోరు విప్పకుండా గంటలు గంటలు ఈ భూగోళం మీది ఏ విషయం గురించన్నా మాట్లాడగలదు- వసపిట్ట - ఇంగ్లీషులో, తెలుగులో, హిందీలో అనర్గళంగా.

పాత పోస్టాఫీసు దగ్గర మహా ఘనత వహించిన విక్టోరియా మహారాణి విగ్రహం వద్ద ఇద్దరు శ్వేతజాతి ముసలమ్మలతో సత్యమూర్తి ఓ సాయంత్రం కనిపించాడు. మూడు రోజుల నించి ముసురు మూలంగా వాతావరణం చిత్తడి చిత్తడిగా ఉంది. చిన్నగా చినుకులు పడుతున్నాయి. పక్కనే కారు ఆపి వస్తారా అని అడిగాను. ఆ ఇద్దరు ముసలమ్మలు బొంబేలో తన ఎడిటర్ పంపిస్తే ఇక్కడకు వచ్చారట. వాళ్ళల్లో ఒకామెకు ఈ ఊళ్ళో చిత్రకారులను చూడటం, వాళ్ళ చిత్రాలను సేకరించటం పనిట. రెండో ఆమె తెలుగు నేర్చుకుంటోందంట. త్యాగరాజు సంగీతం గురించి విని గత ఏడెనిమిదేళ్ళుగా ఆమె త్యాగరాజు ఆరాధనోత్సవాలకు పదిహేనురోజులు ముందు వచ్చి, ఓ నెలదినాలు మద్రాసులో గడిపి వెళ్తోందంట. ఇప్పుడామెకు తెలుగు నేర్చుకోవాలని

చిత్రాలు : నరసిం



బుద్ధి పుట్టిందంట. కర్నాటక సంగీతంతో ఆమెకు పరిచయం ఉందంట. తను త్యాగరాజు సంగీతం మీద రాయ తలపెట్టిన ఉద్గ్రంథం కోసం తెలుగు నేర్చుకోవటానికి ఆమె విశాఖపట్నం ఎంచుకుందంట. ఆ వృద్ధుల ఉత్సాహం చూస్తుంటే ఏం పిచ్చి వీళ్ళకి అనిపించింది.

వాళ్ళల్లో ఆ లావుటామె అమెరికా జాతీయురాలు. బక్కపల్చగా, పొడవుగా ఉన్న ఆ రెండో ఆమె బ్రిటిష్‌ట. ఈమెగారే త్యాగరాజు భక్తురాలు. ఇద్దరూ చీరలు కట్టుకున్నారు. ఆ లావుటామె నుదుట కుంకుమ బొట్టు పెట్టుకుంది. వాళ్ళిద్దరూ పది రోజులు ఓ హొటల్‌లో ఉండి ఇప్పుడు రెండు నెలల కోసం లాసన్స్ బే దగ్గర ఓ అపార్ట్‌మెంట్ తీసుకున్నారంట. వాళ్ళకు సత్యమూర్తి గైడ్.

అదే తొలిసారి సత్యమూర్తి ఉంటున్న రెండు గదుల అద్దె కొంపని పోతూపోతూ దార్లో చూడటం. కృష్ణనగర్‌లో ఓ పాతకాలపు పెంకుటిల్లు. సత్యమూర్తికి విశాఖపట్నం బొత్తిగా కొత్త కాదట. అతడు పుట్టటం ఈ ఊళ్ళోనేనట. అతడి బాల్యం ఇప్పుడతడుంటున్న ఈ కృష్ణనగర్‌లోనే గడచిందంట. అయితే, తలిదండ్రుల బదలీల మూలంగా ఆరో ఏట సత్యమూర్తి కుటుంబం



నాకన్నా మా అమ్మాయి తెలివైంది. ముఖ్యంగా కొత్తవాళ్ళతో, ఈ తరం వాళ్ళతో కలుపుగోలు తనంతో, వాళ్ళు నోరు విప్పకుండా గంటలు గంటలు వసపిట్టలా అనర్గళంగా మాట్లాడగలదు.

విశాఖపట్నం విడిచిపెట్టి వెళ్ళిపోయిందంట. దాదాపు గత రెండున్నర దశాబ్దాలు విజయవాడ, ఏలూరు, హైదరాబాదుల్లో గడచిందంట. ఇప్పుడు తల్లీ, తండ్రీ తన పెద్దన్నయ్య దగ్గర ఏలూరులో ఉంటున్నారట. ఆ రకంగా సత్యమూర్తికి కొత్త విశాఖపట్నంకన్నా పాత విశాఖపట్నం అంటేనే ఇష్టంట.

విశాఖపట్నం అందం విశ్వరూప సాక్షాత్కారం కావాలంటే కలెక్టరాఫీస్ బంగ్లా మొదటి అంతస్తు నించి సముద్రాన్ని చూడండి. మహారాణీ పేట కొబ్బరి చెట్ల పచ్చదనంతో కలిసిపోయే నీలం సముద్రం, ఆ వెనక తేజోవంతమైన అనంతాకాశం కనిపిస్తాయి. ఆ దృశ్యం అపురూపం. మన ఆత్మల్లో ఏళ్ళ తరబడి పేరుకుపోయిన మురికిని కడిగేసే జలపాతంలాంటి అందం. మరో ఐదారేళ్ళలో అంతస్తుల మహాభవనాలు ఆకాశానికి లేచిపోయి, ఈ అద్భుత సౌందర్య దృశ్యాన్ని తుడిచిపెట్టేస్తాయని అతడి ఆందోళన. విశాఖపట్నం పరిసర ప్రాంతాల అందాలు గురించి కవిత్వం చదువుతున్నట్టుగా ఉంటుంది సత్యమూర్తి మాట్లాడుతుంటే.

అవును. విశాఖపట్నం మరో పదేళ్ళలో ఏమవుతుందో ఎవరూ ఊహించేట్టు లేదు. రాక్షసకోరలతో పెరుగుతున్న ఈ పరిశ్రమలను చూస్తే నాకూ భయంగానే ఉంది. భూగర్భ మురుగునీటి పారుదల కనీస సదుపాయం కూడా లేని ఈ వర్ధమాన నగరం నెత్తిపైన కాలుష్యం భస్మాసురహస్తమవుతుందన్నది సత్యమూర్తి భయం.

తార రెండు మూడుసార్లు సత్యమూర్తి గురించి గుర్తు చేసుకున్న సంగతి చెప్పాను. ఆరోజు మొట్ట మొదటిసారి మా ఇంటికి వచ్చినప్పుడు సత్యమూర్తి ఓ గంటసేపు తారగాని, అక్కడున్న ఇతరులుగాని పెదవి విప్పకుండా మాట్లాడాడట. అది తార నోట విన్నప్పుడు నాకు నమ్మశక్యం కాలేదు. ఆ విషయం చెప్పినప్పుడు సత్యమూర్తి నవ్వి ఊరుకున్నాడు.

వాళ్ళను మా ఇంటికి తీసుకువెళ్ళాను. కాఫీ తాగి వెళ్ళమంటే సంతోషంగానే ఆమోదించారు ఆ ముసలమ్మలు. అయితే, వాళ్ళు ముగ్గురూ మాటాడుకున్న విషయాలు నాకేం అర్థంకాలేదు. రెండురోజుల క్రితం రవీంద్రరెడ్డి శిల్పాలు చూశారట. ప్రశంసలతో ఆ శిల్పాల గురించి, సంగీతం గురించి, చిత్రలేఖనం గురించి వాళ్ళల్లో వాళ్ళు మాటాడుకున్నారు. ఆ ప్రపంచం నాకు కొత్త కావటంతో నేను వాళ్ళతో మాట కలపలేకపోయాను. తార ఢిల్లీ వెళ్ళినట్టు సత్యమూర్తికి తెలిసినట్టే ఉంది.

వయసులో సత్యమూర్తి నాకన్నా కనీసం ఇరవై ఏళ్ళన్నా చిన్న ఉండవచ్చు కానీ, మానసికంగా అతడి ఎదుగుదల చూస్తే ఈ వయోభేదం తారుమారయ్యేది.

తార ఢిల్లీ వెళ్ళి వాళ్ళ బాబాయి సలహా సంప్రతింపులకు విరుద్ధంగా అన్నీ తారుమారు చేసి వచ్చింది. ఇదివరకు మీ ఇష్టం, మీ ఇష్టం అన్నదల్లా ఇప్పుడు చూసి, మాట్లాడి తిరస్కరించి వచ్చింది. మా తమ్ముడు శ్రీకాంత్ హోదా, పదవి చూసి వాళ్ళు ఈ సంబంధం పట్ల ఆసక్తి చూపారే కానీ, మా హోదాని చూసి మాత్రంకాదు. ఆ యువకుడు స్టేట్స్‌లో సంపాదించే డాలర్ల మీద మోజుతో ఈ సంబంధాన్ని కోరలేదు మేము. తార చదువుకు తగిన హోదా ముఖ్యమనిపించి, అన్ని విధాల ఆ కుర్రవాడు తగిన యోగ్యుడనిపించింది. శ్రీకాంత్ ఫోన్‌చేసి చెప్పినప్పుడే తారతో మాట్లాడాను. స్టేట్స్‌లో జీవితాంతం బతకాలన్న ఆలోచన తనను భయపెట్టిందని కచ్చితంగా చెప్పేసింది. మీరు ఈ దేశం తిరిగి ఎప్పుడు వచ్చేస్తారు అని ఒకే ఒక ప్రశ్న అడిగిందట ఆ అబ్బాయిని. తన తలిదండ్రులు అక్కడే స్థిరపడిపోయినందున తనకు ఈ దేశం తిరిగిరావాలన్న ఆలోచనలేదని ఆ యువకుడు చెప్పాడట. అక్కడ తెగిపోయింది వ్యవహారం. అతడి ఆలోచనాధోరణి తారకు నచ్చలేదట. శ్రీకాంత్ ఆ అబ్బాయి గురించిన ఈ వివరాలన్నీ ముందుగా చెప్పినవే. అప్పట్లో ఈ అభ్యంతరాలు తార ఎందుకు చెప్పలేదో మాకు అర్థం కాలేదు. సత్యమూర్తి ప్రభావం ఏమన్నా పడిందా అన్న సందేహం మనసు అట్టడుగు పొరల్లో కదులుతుండేది.

ఈ సంబంధం స్థిరపడినట్టు బంధువుల్లో, స్నేహితుల్లో ప్రచారం కావటంతో మాకు అవమానంగా, ఇబ్బందిగా ఉంది. అమ్మాయికి నచ్చలేదని ఓ కొత్త అబద్ధం చెప్పుకోవాల్సివస్తోంది. అయితే, తార ఇవేవీ దృష్టిలో పెట్టుకోకుండా ఏమీ జరగనట్టే ప్రవర్తిస్తోంది. మరట్లాంటి పరిస్థితిలో సిటీబ్యాంక్ ఆహ్వానించి ఇచ్చిన ఉద్యోగం తిరస్కరించటం దేనికి? ఈ దేశంలో ఉండబోవటం లేదన్న ఉద్దేశంతోనే కదా. మా చిన్నమ్మాయి మాల చదువు మధ్యలో మానేసి పెళ్ళికి తొందరపడినప్పుడు దాని ధోరణి మాకు అప్పుడు నచ్చలేదు. అక్కని ఆదర్శంగా తీసుకుని బుద్ధి తెచ్చుకోమని హితబోధ చేశాము. ఇప్పుడు అనిపిస్తోంది, మాల నిర్ణయమే సరయిందని. భర్తతో ఇప్పుడు ఇంగ్లండులో ఇద్దరు పిల్లలతో సంతోషంగా ఉంది. రెండుసార్లు మేము వెళ్ళివచ్చాము.

ఇది ఇట్లా ఉండగా ఒకానొక ప్రముఖ వారపత్రిక సత్యమూర్తి దేవరకొండ కథ 'మహానగరం' వచ్చే వారం వస్తున్నట్టు ప్రకటించింది. ఆ రోజుల్లోనే సత్యమూర్తి ఓసారి స్నేహితుల పనిమీద బ్యాంక్‌కి వచ్చాడు. ఒక స్నేహితునికి బంగారం మీద అప్పు, ఒక సాంస్కృతిక సంస్థకు విరాళాల సేకరణ, నాగరాజు కొత్త ప్రయోగాత్మక నాటకానికి టికెట్ల అమ్మకం - ఈ మూడు పనులు ఒకేసారి చేసుకుని వెళ్ళాడు. కానీ, తన కథ వచ్చే వారం పత్రికలో వస్తున్న సంగతి మాత్రం చెప్పలేదు.

సత్యమూర్తి కథ 'మహానగరం' పత్రికలో మధ్య పుటల్లో ప్రముఖంగా వచ్చింది. కథ నాకు నచ్చలేదు. జుగుప్స కలిగించింది. మందు తిన్నట్టుగా ఉంది.

బొంబే నేపథ్యం. ఓ సంపన్న వాణిజ్యవేత్త కూతురు ప్రసవ సమయంలో చచ్చిపోతుంది. పసిగుడ్డు - తన మనవరాలికి పాలకోసం ఓ పేద పడుచుతల్లితో ఒప్పందం కుదుర్చుకుంటాడు. దాదాపు పదినెలలు వయసున్న తన కొడుక్కి పాలు లోటు చేయకుండానే రెండో బిడ్డకు సరిపడ పాలు ఉన్నందున ఆ పడుచు

తల్లి ఒప్పుకుంటుంది. వాళ్ళు తన ఔట్‌హౌస్‌లో ఉండవచ్చునని యజమాని మరో సదుపాయం కలిగిస్తాడు. ఔట్‌హౌస్‌లోకి మారటానికి ఆమె ఇష్ట పడదు. కొడుక్కి పాలు దొంగతనంగా ఇచ్చుకోవటం ఆమెని కలవరపరుస్తుంది. వాళ్ళు తన ఔట్‌హౌస్ లోకి రాకపోవటంతో యజమానికి కోపం. ఆమె కొడుకు ఆ మురికివాడలో ఓ ఉదయం తప్పి పోతాడు. ఎవరో ఎత్తుకుపోయారని వదంతి ప్రచార మవుతుంది. ఆ వెతుకులాట మూలంగా ఓ పూట ఆమె పాలు ఇవ్వటానికి వెళ్ళలేకపోతుంది. దాంతో ఉగ్రుడయిన యజమాని ఆమె ఉంటున్న గుడిసెకు వచ్చి పాలు పిండుకుని వెడతాడు. మగని కండ్ల ముందే ఈ దౌర్జన్యం జరిగినా అతడు నోరు విప్పడు. అప్పటికే మొగుడు మరో మూడు నెలల జీతం యజమాని నించి ముందుగా తెచ్చుకున్నాడు. దానికి తోడు ఔట్‌హౌస్‌లోకి పోదామని పోరు. దాంతో ఆ పడుచుతల్లి మొగుణ్ణి వదిలేసి, పిల్లవాణ్ణి చంక నెత్తుకుని తన కన్నవారింటికి పల్లెటూరు పారి పోతుంది. ఇదీ క్లుప్తంగా కథ.

మానవతా సౌందర్యభావనని తుంగలో తొక్కేసి రాసిన కథ. 'మహానగరం' అన్న కథ రాసినవాడు గనక ఈ సత్యమూర్తే అయితే, ఈ రచయితను ఇకమీదట గడప తొక్కనీయరాదనుకున్నాను. కథా సాహిత్యంలో మనకు మహా రచయితలు పెట్టిన అపురూపమైన ఒరవడి ఉంది. ఈ ధోరణి సహించరానిది.

'అది నా ముద్ర. జీవితంలో మన చుట్టూ ఉన్న జుగుప్సను పువ్వుల్లో పెట్టి చూపటం ఆత్మ వంచన. భ్రష్టజీవుల దారిద్ర్యానికి అందాలు, తొడుగులు తొడగడం నాకు చేతకాదు. అందుచేత ఆ సాహిత్యపు పోకడలు. నాకు సరిపడవు. నాది కొత్తతరం' అన్నాడు సత్యమూర్తి. ఆ కథమీద పాఠకుల అభిప్రాయం విని బుద్ధి తెచ్చుకుంటాడను కున్న రచయిత ఎదురుతిరిగేసరికి దిక్కుతోచలేదు నాకు. భావదారిద్ర్యం నించి సాహిత్యం పుష్పించదు. భావ జలపాతంగా రచయిత సాహిత్యంలో అడుగు పెట్టాలి. అది నా సంకల్పం అన్నాడు. ఆ వాక్యాలు విన్నప్పుడు సానిదానికి మాత్రం నీతి ఉండొద్దా అన్న మధురవాణి మాటలు నాకు గుర్తొచ్చాయి.

నా అభిప్రాయం తప్పు కావచ్చునని లేదా రచయిత లకు సహజసిద్ధమైన రాగద్వేషాలతో ఏర్పడిన నిష్కారణ మైన ఈర్ష్యాసూయలు కావచ్చునని ఆత్మవిమర్శ చేసుకుని అయిదారుగురు తోటి రచయితలకు ఆ కథ గురించి చెప్పి చదవమన్నాను. ఒకరిద్ద రికి నా పత్రికనే బదులు ఇచ్చి చదివించాను.

వాళ్ళంతా ఆ కథను ఏకగ్రీవంగా తిరస్కరించారు. ఆ రచయితను క్షమించకూడదన్నారు. క్షుద్రసాహిత్యం తర్వాత ఇంకా మరింత ప్రమాదకరమైన జబ్బు తెలుగు కథాసాహిత్యాన్ని పట్టుకుంటున్నదన్న ఆవేదనతో ఆ రచయితను విమర్శిస్తూ సంపాదకునికి ఉమ్మడిగా నిరసన లేఖ రాశారు.

అయితే, వీడు ప్రమాదకరమైన రచయితేనండీ అని మాత్రం వాళ్ళంతా ఏకాభిప్రాయం ప్రకటించారు. రచనలో బలం ఉంది. మొదటి వాక్యం ముట్టు కుంటే చాలు పాఠకుడిని విడిచిపెట్టడు. ముగించాకా మనసులో సంక్షోభం. వాక్యంలో పదునుంది. శిల్పంలో పటుత్వం ఉంది. భాషలో చేవ ఉంది. భావనలో తీవ్రత ఉంది. అవగాహనలో నిర్దుష్టత ఉంది. అక్షరంలో సూనృతం ఉంది. కథ నడిపించగల ఒడుపు తెలిసిన వాడు. సమాజంలోని క్షుద్రత్వం మీద పిడుగులు కురిపించగల భావజాలం ఉంది. ఇప్పుడున్న సాహితీ స్తబ్ధతను ఇతడు బద్దలు కొట్టగలడు అని పరోక్షంగా అందరూ ఒప్పుకున్నారు.

అయితే, ఆ కథలో ప్రతి అక్షరంలో జుగుప్స, బీభత్సం, బర్రెపాలు పిండినట్టు ఆ పడుచు తల్లి పాలు పిండటం నూటికి నూరుపాళ్ళు అసహజం. ఏ యువతీ దాన్ని భరించదు. రచయిత మనోవైకల్యానికి ఇది తిరుగు లేని సాక్ష్యం.

తర్వాత నేను సత్యమూర్తిని కలుసుకోవడం మానేశాను.

అయితే, సత్యమూర్తి నన్ను వదల్లేదు. అతడి స్నేహయోగ్యత ముందు నా పట్టుదల ఓడిపోయింది.

ఇట్లాంటి మానసిక వైపరీత్యం ఈ రచయితకు ఏర్పడటానికి అతడి జీవిత నేపథ్యం ఏమిటా అన్నది నన్ను తొలచటం మొదలుపెట్టింది. ఆ భూమికను పరిశీలిస్తేనేతప్ప ఆ కథ వెనక ఉన్న జీవితం అర్థంకాదనిపించింది.

'మహానగరం' కథ చదివిన తర్వాత సత్యమూర్తి పట్ల ఏర్పడిన అనుమానం క్రమంగా తగ్గుముఖం పడుతున్న సమయంలో సిరిపురం జంక్షన్ సమీపంలో నాగరాజు ప్రదర్శిస్తున్న ప్రయోగాత్మక నాటకం దగ్గర సత్యమూర్తితో తార కనిపించింది. వాళ్ళతో తొంభై ఏళ్ళ ముసలాయన అప్పలస్వామిగారు ఉన్నారు. ఆయన తెలుగు సాహిత్యంలో పాతకొత్తల వారధి. నాలుగు తరాల రచయితలకు ఆప్తుడు. తెలుగుదేశంలోని మారుమూల పల్లెటూళ్ళలోసైతం ఉన్న నిన్న మొన్నటి తొలి కథారచయితలను కూడా ఆయన ఎరుగును. బెంగాలీ, ఒరియా, హిందీ భాషల నించి, సంస్కృత గ్రంథాలనించి ఆయన చేసిన అనువాదాలు, ఆయన స్వతంత్ర రచనలు - ఆయన్ని సాహిత్యంలో వైతాళికునీ, వేగుజుక్కనీ చేశాయి. ఆయన్ని ఎప్పుడో నేను కథలు రాస్తున్న రోజుల్లో దాదాపు ఇరవైఏళ్ళ క్రితం తరచు కలుసుకునేవాడిని. ఆయన అభిప్రాయాలు అమూల్యంగా ఉండేవి. తర్వాత ఆయన్ని కలుసుకోవటం తగ్గిపోయింది. చాల రోజుల తర్వాత ఇప్పుడిక్కడ ఆయన్ని చూడటం.



**ఆ రాత్రి జానకీ నేనూ తారతో పెళ్ళి గురించి మాట్లాడినప్పుడు "పెళ్ళికన్నా చాలా ముఖ్యమైనవి ఉన్నాయమ్మా మన జీవితాల్లో" అంది.**

నాకా దృశ్యం విద్యుత్తులా తోచింది. పొరపడ్డా నేమోనని మరోసారి పరీక్షగా చూశాను. తార నాటకం తిలకించటంలో తన్మయురా లయింది. తార ఏమిటి? ఈ వీధి నాటకాలవాళ్ళ గుంపులో కనిపించడమేమిటి అన్న విభ్రాంతితో సతమతమవుతున్నాన్నేను. తారను నేను అట్లా పెంచలేదు. ఢిల్లీలో వాళ్ళ బాబాయి దగ్గర ఉండి కిండర్‌గార్డన్ నుంచి డిగ్రీ వరకు చదువుకుంది. ఆమె మిరాండా కాలేజీలో స్టూడెంట్ యూనియన్ సెక్రెటరీ. తర్వాత అహ్మదాబాద్ ఐ.ఐ.ఎమ్‌లో ఎమ్.బి.ఎ చేసింది. ఎమ్.బి.ఎ రెండో ఏడాదిలో ఉండగానే ఆమెకి విదేశీ కంపెనీలలో పెద్ద హోదాలకు చెందిన ఉద్యోగాలు వెతుక్కుంటూ వచ్చాయి. ఆరు నెలల కిందటే తార స్టేట్స్ వెళ్ళిపోవలసింది. పెళ్ళి ఈ దేశంలో చేసి బంధుమిత్రులతో సంతోషం పంచుకోవా లన్న మా ఆశ మూలంగా వాయిదావేయటంతో ఈ కొత్త పరిణామాలు. చిన్నమ్మాయి మామీద ఎదురు తిరిగి చేసుకున్న పెళ్ళికావటంవల్ల ఇంట్లో ఈ పెళ్ళినన్నా ఘనంగా చేయాలని తలంచాము.

మా ఆలోచనలన్నీ తలకిందులైనట్టు తెలుస్తూనే ఉంది. ఈ సంగతి జానక్కి తెలిస్తే తట్టుకోలేదు. నా భయాలన్నీ అబద్ధాలు కాకూడదా? తార అక్కడ సత్యమూర్తిని కలుసుకోవడం యాదృచ్ఛికం కాకూడదా? తారకోసం నాగరాజు ఫోన్ చేయటంలో అర్థం ఇప్పుడు తెలుస్తోంది. ఆమధ్య నాగరాజు ప్రదర్శనను భగ్నం చేసి దుండగులు అతడినీ, ఆ నటుల్నీ కొట్టినప్పుడు తార రాత్రి చాల పొద్దుపోయిన తర్వాత ఇల్లు చేరుకోవడం - తీగెలా డొంకంతా కదిల్చి నన్ను పీడించసాగాయి. తార రెండేళ్ళు హాస్టల్ జీవితంలో ఎంతో నిబ్బరంగా వ్యవహరించిందన్న ధైర్యం, గర్వం, తెలివితక్కువగా తార వ్యవహరించబోదన్న నా గట్టి నమ్మకం కూడా ఆ సమయంలో నన్ను శాంతపరచలేకపోయాయి. నెలదినాల కిందట తార ఢిల్లీ వెళ్ళి నికరమైపోయిన సంబంధాన్ని తోసిపుచ్చి రాకపోతే నాకీ అనుమానాలే వచ్చేవికావు.

నేను అనుకున్నంతా జరిగింది. ఆ రాత్రి జానకీ నేనూ తారతో పెళ్ళి గురించి మాటాడినప్పుడు "పెళ్ళికన్నా చాలా ముఖ్యమైన కార్యకలాపాలు ఉన్నా యమ్మా మన జీవితాల్లో" అంది. నాకు గుండె ఆగిపోయినంత పని అయింది. జానకే నయం. తట్టుకోగలిగింది. అయితే, జానక్కి సిరిపురం జంక్షన్ ఉదంతం తెలీదు. నేను చెప్పలేదు.

''అంటే?'' జానకి...

''జీవితంలో మనం చేయతలపెట్టిన మంచి పనులకు పెళ్ళి శత్రువు. పెళ్ళి చేసుకుని పిల్లల్ని కనటానికే అయితే, ఈ చదువులు చదువుకోవడం దండుగ.'' అంది తార.

ఇప్పుడు నాకు చాల స్పష్టం - ఇది సత్యమూర్తి భాష.

సత్యమూర్తి కొత్తగా రాసిన నాటకం రంగస్థల ప్రదర్శనకు సంబంధించిన నిర్మాణాన్ని తాను చేపట్టాలని నిశ్చయించుకున్నట్టు చెప్పి, తనకు సాంస్కృతిక రంగంలో అడుగుపెట్టాలని ఉందని తన నిర్ణయం ప్రకటించింది తార. మహానగరాలలో కోటీశ్వరుల బిడ్డలు, పారిశ్రామిక వేత్తల భార్యామణులు ఇట్లాంటి సాంస్కృతిక కార్యకలాపాలను చేపట్టటం మామూలే. ఆర్ట్ గేలరీలు, థియేటర్లు, హస్తకళా ప్రదర్శనలు, జానపద కళలు, ఆదివాసీ సంస్కృతి పునరుద్ధరణ మొదలయినవి వాళ్ళ విలాసాల్లో ఒక భాగం. అయితే, వాళ్ళు వాటిని వాణిజ్యపరంగా జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక సంస్థలతో సంబంధాల కోసం, హోదాలకోసం, పలుకుబడికోసం, ఆ స్థాయి జీవితంకోసం చేస్తారు. ఇక్కడే తార తప్పటడుగు వేస్తోంది. తన సామాజిక బాధ్యత అంటోంది. ఈ మహాసాగరంలోని తిమింగిలాల సంగతి తెలీక తార అడుగుపెట్టోంది. ఇది ఎంత ప్రమాదకరమైన సమస్యో నాకు తెలుసు. కొన్నాళ్ళకు తారకు ఈ ఇల్లు నచ్చక పోవచ్చు. మేము ఆమె మేలు కోరేవాళ్ళం కాకపోవచ్చు. ఎప్పుడూ ఊహించని రీతిలో ఎదురయిన ఈ సమస్యకు ఏ పరిష్కారమార్గమూ కనిపించలేదు. జానకి కన్నీళ్ళు పెట్టుకుంది. తారలో తిరుగుబాటు ధోరణి భరించగల గుండెదిటవు జానక్కి లేదు.

రెండు వారాలు మేము ఆఫీసులకు సెలవు పెట్టాల్సివచ్చింది. జాతకం తీసి చూపించాము. తార వివాహయోగం బలంగానే ఉందని జ్యోతిష్కారులు చెబుతున్నారు. కంచి వెళ్ళి పరమాచార్యవారి అనుగ్రహం పొంది, వారితో మా ఆవేదన నివేదించుకున్నాము. పుట్టపర్తి వెళ్ళి మేము తట్టుకోలేని సమస్యను మానెత్తిన పెట్టవద్దని భగవాన్‌ని ప్రార్థించాము. మా పూజ్య గురువర్యులవారిని ఈ ఆపదనించి కూడా మమ్మల్ని రక్షించమని వేడుకున్నాము. చివరకు నాకు ఒకే పరిష్కారమార్గం తోచింది. సత్యమూర్తితో అరమరికలు లేకుండా హృదయం విప్పి మాటాట్టం. జానకీ నేనూ వెళ్ళి ఇద్దరం అతనితో మాట్లాడాలనుకున్నాం.

ఆది నాలుగోసారి సత్యమూర్తికోసం వెళ్ళటం. మొదటిసారి వెళ్ళినప్పుడు స్నేహితుల్తో అరకు వెళ్ళాడన్నారు. ఇంకోసారి కనుక్కుంటే ఢిల్లీ వెళ్ళాడన్నారు. మరోసారి ఊళ్ళో ఉన్నాడు కానీ, ఎప్పుడొస్తాడో తెలీదన్నారు.

కిందపరచిన పరుపుమీద కూచుని రాసుకుంటున్న సత్యమూర్తి నన్ను చూసి కలం పక్కకు పెట్టి లేచి సంతోషంతో ఎదురువచ్చాడు. గది చాల విశాలంగా ఉంది. కూచోటానికి గదిలో కుర్చీలు ఏమీ లేవు. పెద్ద పరుపు. దానిమీద అందమైన బొమ్మల దుప్పటి, చేరగిలబడి కూచోటానికి వీలుగా గోడకి అమర్చిన పెద్ద పెద్ద దిండ్లు. అలమరా నిండా పుస్తకాలు. బిస్మిల్లా ఖాన్ షెహనాయ్.

చల్లని చలికాలపు వెల్తురు.

ఆ గదిలో తైలవర్ణ చిత్రాలు నన్ను ఆకర్షించాయి. వాటి గురించి అడిగాను. ఆ మూడు చిత్రాలు తన స్నేహితులవట. పత్రికలో పనిచేస్తున్న రోజుల్లో కొనుక్కున్నాడట వాళ్ళలో ఒక చిత్రకారుడు ఇప్పుడు తన పెయింటింగ్‌ని ఏభైవేల రూపాయలకు పైగా అమ్ముతున్నాడట.

సత్యమూర్తి జానకిని చూడటం ఇదే తొలిసారి. ఆదరంగా నమస్కారంతో పలకరించి మమ్మల్ని పరుపుమీద కూచోబెట్టాడు.

''అమ్మకి ఉత్తరం రాస్తున్నాను. మీరొచ్చారు.''

ప్రియురాలికి ఉత్తరం రాస్తున్నాను అనాల్సిన వయసులో అమ్మకు ఉత్తరం రాస్తున్నాను అన్న వాక్యం నా చెవికి ఇంపుగా వినిపించింది.


''మా అమ్మకి నా రచన చాలా ఇష్టం. చాలా మంచి ఉత్తరాలు రాస్తుంది. నా రచనలో తప్పులూ, ఒప్పులూ చూపి తన అభిప్రాయం రాస్తుంది. నా మొట్టమొదటి పాఠకురాలు, విమర్శకురాలు మా అమ్మే. దాంతోపాటు స్వాతంత్ర్య పోరాట కాలంనాటి తన అనుభవాలు, జైలు జీవితం, ఆనాటి నాయకుల త్యాగాలు, సాహసాల గురించి రాస్తుంది. నేను నా ఉత్తరాల్లో విశాఖ అందాల గురించి పేజీలు నింపుతాను.''

సత్యమూర్తి పేర్లో ఔచిత్యం అప్పుడు నాకు స్ఫురించింది.

గదిలో తేలియాడుతున్న సంగీతం గురించి ''బిస్మిల్లా ఖాన్‌తో కూచున్నారా?'' అన్నాను.

''ఖాన్ సాబ్‌కి నా వ్యాసం చాల నచ్చింది. ఆయన్తో వారణాశిలో రెండు రోజులు గడిపి వచ్చేస్తుంటే గుర్తుగా ఇచ్చిన బహుమతి ఇది. పత్రికలో పని చేసిన ఆ రెండేళ్ళూ మా

**గేటువరకు వెళ్ళి సత్యమూర్తి ఆయన్ని సాగనంపి వచ్చారు. మాకు అంత జుగుప్స కలిగించిన కథ అప్పలస్వామిగారికి నచ్చింది.**



సంపాదకుడు నన్ను గట్టిగా సానపట్టాడు. సంగీతం, చిత్రకళ, రంగస్థలం, సాహిత్యం నాకు ఇష్టమైన రంగాలని గుర్తుపట్టి పెద్ద పెద్దవాళ్ళతో ఇష్టాగోష్ఠి కార్యక్రమాలకు నన్ను పంపించేవాడు. పిట్టలా ఉన్న నన్ను చూసి వాళ్ళు నీరసించిపోయేవాళ్ళు, నిరుత్సాహపడే వాళ్ళు, నాకే సిగ్గనిపించేది. అయితే, చివరికి సాగనంపేటప్పుడు మళ్ళీ ఎప్పుడొస్తావు అని ప్రోత్సహించి, బొంబే వచ్చినప్పుడల్లా నన్ను పిలిపించుకునేవాళ్ళు. వాళ్ళ అభిమానం నన్ను చివరికి ఇటేపు తిప్పింది. సృజనాత్మక రంగానికి అంకితం కావాలనుకున్నాను.''

ఈ ముచ్చట్లు సాగుతుండగా అప్పలస్వామిగారు వచ్చారు. ''సత్యమూర్తీ, నీ కొత్తకథ 'మహానగరం' చదివానయ్యా. కథలట్లా రాయాలి. నన్ను నీ అభిమానిని చేసుకున్నావ్. పత్రిక వచ్చిన చాలా రోజులకి చదివానులే. వారం పదిరోజుల్నించి అనుకుంటున్నాను, కలిసి నిన్ను అభినందించిపోవాలని. ఈలోపల ఓసారి మదనపల్లె వెళ్ళాల్సివచ్చింది. ఈ కథలో మహానగరానికి ప్రతీకగా ఆ సేఠ్‌ని చూపడం నాకు నచ్చింది. అవును, పల్లెటూళ్ళని ఇప్పుడు ఈ మహానగరాలు దోచేస్తున్నాయి. నీవన్నది నిజం. వర్తమాన సమాజంలోని క్షుద్రత్వం మీద జుగుప్స కలిగించలేని సాహిత్యం సాహిత్యమే కాదు. కుండబద్దలు కొట్టినట్టు చెప్పావులే. ఆ ప్రతీకలు సలక్షణంగా కుదిరాయిలే. కొన్ని దగ్గర్ల భావతీవ్రత కవిత్వమయమయింది. ఆ హద్దు దాటి పోయిందా కథకు కవిత్వ గుణం బరువవుతుంది. జాగ్రత్త. గొప్పగా రాసేవులే. ఇట్లాంటి కథలు ఇంకా ఇంకా రావాలి'' అని ఆయన బయటనే నుంచుని ''స్నేహితులు వచ్చినట్టున్నారు. నువ్వు ఉండు. చాలా రోజులయింది ఇంటికి వచ్చి. ఓసారి తీరిగ్గా రా. నే వెళ్తాను. ఆఁ - అన్నట్టు ఆ పత్రికకి ఒక ఉత్తరం రాశాను, ఈమధ్య నేను చదివిన మంచి కథల్లో మంచిదని'' అని ఆయన చేతికర్ర ఊపుకుంటూ వెళ్ళిపోయారు. గేటువరకు వెళ్ళి సత్యమూర్తి ఆయన్ని సాగనంపి వచ్చారు.

నాకూ నా ఇతర రచయిత మిత్రులకూ అంత జుగుప్స కలిగించిన కథ అప్పలస్వామిగారి లాంటి రుషితుల్యుడయిన సారస్వతమూర్తికి నచ్చింది. ఆ కథలో ఆయన చెబుతున్న ప్రతీకలు ఎక్కడున్నాయో నాకయితే అర్థంకాలేదు. ఆ కథ వెనక ఒక సందేశం ఉన్నట్టు కూడా నాకు ధ్వనించలేదు. ఇన్ని అందాలు ఆ కథలో నిజంగానే ఉన్నట్టా? నాకు పెద్ద గాయం తగిలినట్టుగా ఉంది. మనసు మీద పేరుకుపోయిన పెంకులు మరింత బలంగా బిగుసుకుపోతున్నట్టనిపించింది. హృదయం కరుడుకట్టుకుపోవడం అంటే ఇదేనా?

తార గురించి ఎన్నో విషయాలు సత్యమూర్తితో మాట్లాడాలనుకున్నాను. నా నోరు ఇప్పుడు మూత పడింది. అయితే, మా నోటి నుంచి రాని ఎన్నో ప్రశ్నలకు సత్యమూర్తి ముఖంలో సమాధానాలు కనిపించాయి.

ఎందుకు కథలు రాయడం మానేశారు అన్న ప్రశ్న మరోసారి సత్యమూర్తి అడగకపోవటానికి కారణం ఏమిటో ఇప్పుడు బోధపడుతున్నట్టుగా ఉంది. ■